క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

ములుగు రూరల్: జిల్లా కేంద్రంలో కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల స్పెషల్ ఆఫీసర్ జీవనప్రియ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీఈసీ విభాగంలో 29 సీట్లు, ఎంపీహెచ్‌డబ్ల్యూ గ్రూప్‌లో 27 సీట్లు ఖాళీగా ఉన్నాయని అన్నారు. అలాగే 6వ తరగతిలో 10, 7వ తరగతిలో 8 సీట్లు ఖాళీగా ఉన్నాయని అర్హత కలిగిన విద్యార్థినులు ఈ నెల 23 వరకు పాఠశాలలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

రేపు స్పాట్ అడ్మిషన్లు

కన్నాయిగూడెం: మండలంలోని ముప్పనపల్లి కేజీబీవీలో రేపు(సోమవారం) స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు పాఠశాల స్పెషల్ అధికారిని అశ్విని శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీలో 23, బీపీసీ 20తో పాటు 6 తరగతిలో 5, 7 తరగతిలో 2, 8 తరగతిలో 8, 9తరగతిలో ఒకటి సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు.

మంగపేటలో..

మంగపేట: మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో నూతనంగా చేరేందుకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కేజీబీవీ స్పెషలాఫీసర్ పాయం భాగ్యలక్ష్మి తెలిపారు. ఎంపీసీలో 30, బైపీసీలో 10 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆరో తరగతిలో 6, ఎనిమిదో తరగతిలో 05, తొమ్మిదిలో 10 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు.

సన్మానం

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం ప్రాథమిక పాఠశాలకు చెందిన నాలుగో తరగతి విద్యార్థి కోల శాన్వి హైదరాబాద్‌లోని హకీంపేట్ స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపిక కావడంతో ప్రధానోపాధ్యాయుడు పెంటి శ్యామ్ ఆధ్వర్యంలో శనివారం సన్మానించారు. మారుమూల గ్రామానికి చెందిన బాలిక రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ పోటీల్లో పాల్గొని క్రీడా పాఠశాలకు ఎంపిక కావడంపై స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు డి.రాజేందర్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ లక్ష్మి అభినందించారు.

'బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణాన్ని అడ్డుకుంటాం'

ములుగు రూరల్: బనకచర్ల అక్రమ ప్రాజెక్టు నిర్మాణాన్ని అడ్డుకొని, సీఎం రేవంత్‌రెడ్డి దురాలోచనను ప్రజలకు వివరిస్తామని బీఆర్ఎస్ విద్యార్థి విభాగం జిల్లా ఇన్‌చార్జ్ కోగిల మహేశ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గోదావరి 200 టీఎంసీల జలాలను బనకచర్ల ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు అక్రమంగా తరలించుకుపోవాలని చూస్తే ఉరుకునేది లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిగురు దేవేందర్ తదితరులు ఉన్నారు.

కలప పట్టివేత

కన్నాయిగూడెం: మండలంలోని కంతనపల్లిలో జిట్రేగి, టేకు కలపను అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. గ్రామంలో ఓ కార్పెంటర్ ఇంటి వద్ద కలపను ఉంచారనే సమాచారంతో అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. కలపను స్వాధీనం చేసుకొని రేంజ్ కార్యాలయానికి తరలించారు. కాగా, పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఉన్నత స్థాయికి చేరుకోవాలి

కన్నాయిగూడెం: విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని తహసీల్దార్ సర్వర్ అన్నారు. మండలంలోని గుర్రేవుల హైస్కూల్, ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు సినాప్సిస్ యూనైటెడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగులు, పెన్నులు, పెన్సిళ్లు, స్టేషనరీలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి తహసీల్దార్ హాజరై మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు స్వచ్ఛంద సంస్థ ఇలాంటి సేవలు చేయడం చాలా సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పాపయ్య, వేణుగోపాల్, ఉపాధ్యాయులు జమున, శ్యాం సుందర్, కవిత, రవీందర్, రమేశ్, కుమార్, ఆర్‌ఐ గణేష్ పాల్గొన్నారు.

కరుణించని వరుణుడు

నెర్రెలు బారుతున్న నారుమడులు

- నిరంతరం కరెంట్ లేక ట్రాక్టర్ మోటార్లతో పంట సాగు
- రోజుకు రూ.500పైనే ఖర్చు

ఏటూరునాగారం: జిల్లాలో సకాలంలో వర్షాలు లేక అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. వరిపొలాలకు నిరంతరం సాగు నీరు సంవృద్ధిగా కావాల్సి ఉంది. ఇటు వర్షాలు కురవక, అటు కరెంటు నిరంతరం లేక రైతుల ఆశలు అడిఆశలు అవుతున్నాయి. ములుగు, మంగపేట, వెంకటాపురం(ఎం), గోవిందరావుపేట మండలాల్లోనే కేవలం 3వేల ఎకరాల వరకు వరి నాటు వేసినట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. మిగతా మండలాల్లో వరి నాట్లు మొదలు కాకపోవడానికి వర్షాలు కరువుగా భావిస్తున్నారు. కొంత మంది ధాన్యాన్ని ఇంటి వద్దనే బస్తాల్లో తడుపుకొని మొలకలు వచ్చే వరకు వాటితో కుస్తీ పడుతున్నారు. ఇలా రైతులు ఎవరికి తోచిన ఆలోచనతో వారు పంట సాగు కోసం ఎనలేని కృషి చేయాల్సి వస్తోంది.

జిల్లాలోని పది మండలాల్లో చెరువు, మోటార్లు, ఆకాశం కింది వాయి భూముల్లో వరి పంటను సాగు చేస్తున్నారు. గత కొంది నెలలుగా వరుణుడు ముఖం చాటేయడంతో వర్షాలు లేక వాగులు, చెరువులు ఎండిపోయి దర్శనమిస్తున్నాయి. దీంతో రైతులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై నిమగ్నమయ్యారు. చైనా ఆయిల్ ఇంజిన్‌లు, ట్రాక్టర్ జనరేటర్ ఇంజిన్లు, ఆయిల్ ఇంజిన్లను ఆసరాగా చేసుకొని మోటార్లకు అమర్చి సాగునీటి పారిస్తున్నారు. ఇలా గంటల తరబడి ఇంజిన్ నడిస్తే గానీ ఒక ఎకరం పొలం తడవడం లేదు. ఒక ఎకరానికి రోజు డీజిల్ ఖర్చు రూ.400 నుంచి రూ. 500 వరకు ఖర్చు వస్తుందని రైతులు వాపోతున్నారు. ఇలా చేస్తే వ్యవసాయం దిగుబడికి వచ్చిన పంటలకు ఆయిల్ ఇంజిన్ల డీజిల్‌కే సరిపోతుందని, రైతు కష్టం నీళ్ల పాలవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఈ ఫొటోలో ట్రాక్టర్ మోటారు వద్ద ఉన్న రైతు చల్లగురుగుల చలపతి (దళపతి). ఏటూరు నాగారం మండలంలోని రొయ్యూర్ శివారు ప్రాంతంలో ఆరు ఎకరాల వరి పొలాన్ని సాగు చేస్తున్నాడు. వరి పంటకు సరైన విద్యుత్ సరఫరా లేక ట్రాక్టర్‌కు ఆయిల్ ఇంజిన్‌ను అమర్చి మోటారు ద్వారా నీటిని పొలానికి పారిస్తున్నాడు. దీంతో రోజుకు రూ.500 పైగా ఖర్చు వస్తుంది. ట్రాక్టర్‌కు డీజిల్ పోయడంతో పెట్టుబడి అధికం అవుతుంది. పంటకు నీరు లేకపోవడంతో వరిపొలాలు బీటలు బారుతున్నాయి. పంట చేతికి వచ్చే వరకు నమ్మకం లేని పరిస్థితిలో రైతులున్నారు.

రైతుల ఇబ్బందులు

గతంలో 24 గంటల పాటు రైతులకు ఉచిత విద్యుత్‌ను సరఫరా చేసేవారు. ఇప్పుడు విద్యుత్ సమయపాలన కేటాయించడంతో కరెంటు ఎప్పుడు వస్తోందో..ఎప్పుడు పోతుందో తెలియక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే వాటిని మార్చేందుకు రైతులు ఖర్చులు భరించుకోవాల్సి వస్తోంది. ఇలా చేయడంతో రైతులు వరిసాగు పంటలపై విరక్తి వస్తుందని అసహనం వ్యక్తం చేస్తున్నారు.



నెర్రెలు బారిన నారుమడి

ఉచిత విద్యుత్ ఇవ్వాలి



నిరంతరం రైతులకు ఉచిత విద్యుత్ ఇవ్వాలి. గతంలో కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు 24 గంటల పాటు ఉచిత విద్యుత్ సరఫరా చేసి పంట పొలాలకు నీటిని సమకూర్చేవారు. ఇప్పుడు కేవలం సమయపాలన కేటాయిస్తూ పంటలను ఎండబెడుతున్నారు. వచ్చే ఏడాదికి వరి పంట జిల్లాలో సాగు పడిపోయే అవకాశాలున్నాయి. వర్షాలు లేక, కరెంటు రాక రైతులు ఇబ్బంది పడుతున్నారు.

– తాడూరి రఘు, మేడారం చెరువు శివారు రైతు, ఏటూరునాగారం

బీజేపీ అభ్యర్థుల విజయానికి కృషి

- మాజీ ఎంపీ అజ్మీరా సీతారాం నాయక్

ములుగు రూరల్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల విజయానికి కార్యకర్తలు కృషి చేయాలని మాజీ పార్లమెంట్ సభ్యుడు అజ్మీరా సీతారాం నాయక్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని అన్నారు. ప్రజల్లో బీజేపీపై నమ్మకం పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరామ్, ఎన్నికల కన్వీనర్ భూక్య రాజు నాయక్, గుగులోతు స్వరూప, రవీంద్రచారి, రాంబాబు, సునీల్ కుమార్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న సీతారాం నాయక్

దివ్యాంగులు తరలిరావాలి



మాట్లాడుతున్న స్వామి

కన్నాయిగూడెం: జిల్లా కేంద్రంలో ఈ నెల 23 నిర్వహించనున్న సమావేశానికి దివ్యాంగులు అధిక సంఖ్యలో తరలిరావాలని దివ్యాంగుల విభాగం నాయకుడు ఆలెం జంపయ్య, ఎమ్మార్పీఎస్ నాయకుడు వావిలాల స్వామి తెలిపారు. శనివారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు తిప్పనపల్లి వెంకట్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. దివ్యాంగుల సమస్యలపై నిర్వహించనున్న సమావేశానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ రానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వావిలాల సతీష్, శంకర్, నల్లెబోయిన భిక్షపతి, బొగ్గుల శ్రీనువాస్, పూలక్క సారయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

యువత బాడీ బిల్డింగ్‌పై ఆసక్తి పెంచుకోవాలి

కాటారం: యువత బాడీ బిల్డింగ్‌పై ఆసక్తి పెంచుకోవాలని 2022 మిస్టర్ తెలంగాణ బాడీ బిల్డింగ్ టైటిల్ విన్నర్ సుంకరి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని హడల్ జిమ్ సెంటర్‌ను శనివారం శ్రీనివాస్‌రెడ్డి సందర్శించారు. జిమ్ సెంటర్‌లోని యువకులకు బాడి బిల్డింగ్, వెయిట్ లిఫ్టింగ్‌పై అవగాహన కల్పించి పలు సూచనలు చేశారు. వ్యాయామం, జిమ్ చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిమ్ సెంటర్ నిర్వాహకులు ఏల్పుల శ్రీనివాస్, సాగర్‌లు శ్రీనివాస్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు.



శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న నిర్వాహకులు

సైడ్ కాల్వల్లో చెత్తాచెదారం

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని ఆకులవారిఘణపురంలో సైడ్ కాల్వల్లో చెత్తాచెదారం పేరుకుపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు బూర చేరాలు, కృష్ణరావు, సమ్మయ్య, రాజిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాల్వల్లో చెత్తాచెదారం తొలగించాలని గతంలో పంచాయతీ కార్యదర్శి, సిబ్బందికి వినతిపత్రాలు అందజేశామన్నారు. కానీ ఇప్పటి వరకు పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

సొంతింటి కల కాంగ్రెస్‌తోనే సాధ్యం

- పార్టీ మండల అధ్యక్షుడు సతీశ్‌గౌడ్

టేకుమట్ల: సొంతింటి కల కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీశ్‌గౌడ్ అన్నారు. శనివారం మండలంలోని రామకిష్టాపూర్(వి), పెద్దంపల్లి, రామకిస్టాపూర్(టి) గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ.. గత ప్రభుత్వం పదేళ్ల కాలంలో డబుల్ బెడ్రూంలు ఇస్తా అని ఆశ చూపి ఇవ్వలేదన్నారు. కానీ ప్రజా ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ముందుకు సాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ఇందిరమ్మ కమిటీ సభ్యులు, లబ్ధిదారులు నాయకులు పాల్గొన్నారు.



భూమి పూజలో పాల్గొన్న నాయకులు

వ్యవసాయ పరికరాల పరిశీలన

ములుగు రూరల్: మార్కెట్ శాఖ ఆధ్వర్యంలో వ్యవసాయ పరికరాలను మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి పరిశీలించారు. శనివారం జిల్లా కేంద్రంలోని మార్కెట్ గోదాంను ఆమె సందర్శించారు. ప్యాడి క్లీనర్లు, వేయింగ్ మిషన్లు, మ్యాచ్యర్ మిషన్లు మరమ్మతులు చేపట్టి ధాన్యం కొనుగోలు సమయంలో రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. మార్కెట్ కమిటీ కార్యదర్శి సోనియా, వైస్ చైర్మన్ సారంగం, సీతారాంనాయక్, దేవ్‌సింగ్ పాల్గొన్నారు.



గోదాంను పరిశీలిస్తున్న రేగ కల్యాణి

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

వెంకటాపురం(ఎం): ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారిణి శైలజ తెలిపారు. శనివారం మండలంలోని పాలంపేట, తిమ్మాపూర్ గ్రామాల్లో వెలుగు రేఖ గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గ్రామసభలు ఏర్పాటు చేసి ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. క్రిమిసంహారక, రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయం చేస్తూ రాబోయే తరాలకు ఆరోగ్యవంతమైన జీవితాన్ని అందించాలని పిలుపునిచ్చారు. ప్రకృతి వ్యవసాయం చేసేందుకు ఒక క్లస్టర్‌కు 125 మంది రైతులను ఎంపిక చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సునీల్, దయానా, వెలుగు రేఖ గ్రామీణాభివృద్ధి సంస్థ సీఈఓ రజిత, ట్రెయినర్లు సాంబయ్య, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఓ శైలజ

పాఠశాలను ఏటూరునాగారానికి తరలించాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రాకేశ్

ఏటూరునాగారం: జిల్లాలోని మల్లంపల్లి మండలంలో ఉన్న సోషల్ వెల్ఫేర్ పాఠశాలను మండల కేంద్రానికి తరలించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సాదు రాకేశ్ అన్నారు. ఎస్ఎఫ్ఐ నాయకులు శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్ జగదీశ్వర్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఏటూరునాగారంలో ఉండాల్సిన సోషల్ వెల్ఫేర్ పాఠశాలను మల్లంపల్లికి తరలించడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఏటూరునాగారం డివిజన్ పరిధిలో ఎస్సీ, బీసీ విద్యార్థులకు వసతి గృహం లేక చదువుకునేందుకు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఎస్సీ, బీసీ జనరల్ వసతి గృహాలను ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బట్ట స్వామి, కోగిల బాలు, ధనూష్, నర్సింగరావు, రాకేశ్, వెంకటేష్, ప్రవీణ్, నరేష్ పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

ఎస్ఎస్‌తాడ్వాయి: మండల కేంద్రంలోని తాడ్వాయి గ్రామానికి చెందిన అంజయ్య ఇటీవల మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాన్ని శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు పరామర్శించి రూ.10,500 నగదు ఆర్థికసాయం అందజేశారు. అలాగే సీపీఎం నాయకులు పరామర్శించి రూ.10,000 అందజేశారు. అనంతరం మృతుడి చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మేడారం జాతర చైర్మన్ అర్రెం లచ్చు పటేల్, మాజీ సర్పంచ్ ఇర్ప సునీల్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ పాక సాంబయ్య, గ్రామ కమిటీ అధ్యక్షుడు పాక రాజేందర్, నాయకులు సిద్దిరెడ్డి, అనుమండ్ల రాజిరెడ్డి, భూషనబోయిన రవికుమార్, భద్రయ్య, రంగబోయిన జగదీశ్, పోషలు, ఓదెలు, పిట్టల సారయ్య, జైపాల్ రెడ్డి, పీరీల వెంకన్న, కర్తీ రమేష్, బంగారి రమేష్, వెంకటేష్, చారి పాల్గొన్నారు.

మంగపేట: మండలంలోని కొత్తమల్లూరు గ్రామానికి చెందిన మాటారి కోటేశ్వర్‌రావు జీవనోపాధి కోసం మహబూబాబాద్ పట్టణానికి వెళ్లి అక్కడే భార్య పిల్లలతో నివాసం ఉంటున్నాడు. కొద్ది రోజుల క్రితం అతడి కూతురు ప్రమాదవశాత్తు ఇంట్లో స్టౌవ్‌పై ఉడుకుతున్న అన్నం గిన్నె మీద పడటంతో గంజి పడి తీవ్రంగా గాయపడింది. ఈమేరకు తొర్రురులోని ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం పొందుతుండగా బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు తాటి కృష్ణ శనివారం పరామర్శించి వైద్య ఖర్చులకు రూ 10,000 నగదును అందజేశాడు.



ఎస్ఎస్ తాడ్వాయి: ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

వ్యక్తిపై కేసు

ములుగు రూరల్: నిర్లక్ష్యంగా వాహనం నడుపుతూ ముందున్న కారును ఢీ కొట్టిన వాహనదారుడిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. డీసీఓ సర్ధార్‌సింగ్ తన కారులో శనివారం హనుమకొండ నుంచి ములుగుకు వస్తున్న క్రమంలో ప్రగతినగర్‌కాలనీ వద్ద వెనక నుంచి మరో కారు ఢీకొట్టింది. నిర్లక్ష్యంగా వాహనం నడిపిన వ్యక్తిపై డీసీఓ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

చిట్యాల: అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులను అందించడమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వం పదేళ్ల పాలనలో ఏనాడు ఒక్క రేషన్ కార్డు ఇచ్చిన దఖాలాలు లేవన్నారు. నియోజకవర్గంలోని నిరుపేదలందరికీ ఆహార భద్రత కార్డులతో పాటు సన్న బియ్యం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాశ్‌రెడ్డి, డీసీఎస్ఓ కిరణ్ కుమార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మడి శ్రీదేవిసత్యం, తహసీల్దార్ షేక్ ఇమామ్‌బాబా, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టేకుమట్ల/మొగుళ్లపల్లి: అర్హులందరికీ రేషన్ కార్డులు అందించి, సన్నబియ్యాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. టేకుమట్ల, మొగుళ్లపల్లిలోని రైతు వేదికల్లో నూతన రేషన్ కార్డులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేసి మాట్లాడారు. నూతన రేషన్ కార్డుల ప్రక్రియను నిరంతరం కొనసాగుతుందన్నారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. టేకుమట్లలో తహసీల్దార్ విజయలక్ష్మీ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సతీశ్‌గౌడ్, కత్తి సంపత్, నాంపెల్లి వీరేశం, కిరణ్‌కుమార్, మొగుళ్లపల్లిలో తహసీల్దార్ సునీత, ఎంపీడీఓ సత్యనారాయణ, నాయకులు రఫీ, తక్కళ్లపెల్లి రాజు, రాము తదితరులు పాల్గొన్నారు.



టేకుమట్ల: రేషన్ కార్డు మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

మార్కెట్ కమిటీ చైర్మన్‌ను కలిసిన సీఈఓ

ఏటూరునాగారం: జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన రేగ కల్యాణిని ఏటూరునాగారం పీఏసీఎస్ సీఈఓ గౌరి శనివారం జిల్లా కేంద్రంలో మర్యాదపూర్వకంగా కలిశారు. సంఘంలో సభ్యత్వాలు, తదితర విషయాలను చైర్మన్‌కు వివరించినట్లు గౌరి తెలిపారు.



కల్యాణికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న గౌరి

అధ్వానంగా బీసీ హాస్టల్



మరుగుదొడ్ల వద్ద ఉన్న చెత్తాచెదారం



హాస్టల్ పరిసరాల్లో వరాహం

- కుక్కలు, పందుల స్వైరవిహారం
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలోని బీసీ బాలుర హాస్టల్ అధ్వానంగా ఉంది. హాస్టల్ పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. చెత్తాచెదారంతో నిండి దోమలకు నిలయంగా తయారైంది. మరుగుదొడ్లు అధ్వానంగా ఉండి దుర్వాసన వస్తోంది. హాస్టల్ గదుల్లో కుక్కలు సేదతీరుతున్నాయి. పరిసరాల్లో పందుల స్వైరవిహారం చేస్తున్నాయి. గదులకు కిటికీలు, తలుపులు శిథిలావస్థకు చేరాయి. అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులకు పౌష్టికాహారాన్ని మెనూ ప్రకారం క్రమం తప్పకుండా అందించాలని ఉత్తర్వులు జారీ చేసింది. కానీ మహదేవపూర్‌లోని బీసీ బాలుర హాస్టల్‌లో పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉంది. హాస్టల్ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.



హాస్టల్ గదిలో సేదదీరుతున్న శునకం

వసతులు కల్పించడంలో విఫలం

మహదేవపూర్ బీసీ బాలుర హాస్టల్‌లో విద్యార్థులకు వసతులు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని ఎమ్మార్పీస్ మండల అధ్యక్షుడు బెల్లంపల్లి సురేష్, నాయకుడు రవితేజ అన్నారు. శనివారం బీసీ హాస్టల్‌ను వారు సందర్శించి మాట్లాడారు. వార్డెన్ పట్టించుకోకపోవడంతోనే హాస్టల్ అధ్వానంగా తయారైందని అన్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం కొట్టచ్చినట్లు కనిపిస్తుందని ఆరోపించారు. వెంటనే మెనూ ప్రకారం భోజనం అందించి, చెత్తాచెదారం తొలగించి తరగతి గదులను శుభ్రం చేయాలని డిమాండ్ చేశారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ములుగు :
9705748198
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
డి. గణేష్ బాబు (S.R) : 9490002099, 7997958188
పి.చంద్రశేఖర్ (A.C.O) : 9963646944